నవతెలంగాణ

1

ఆదిలాబాద్

గురువారం | మార్చి 13, 2025 | www.navatelangana.com

సాకెరలో వైద్య శిబిరం

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

సోన్ మండలం సాకెర గ్రామంలో బుధవారం వందన ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని హాస్పిటల్ మేనేజ్మెంట్ సురేష్‌గౌడ్ అన్నారు. ఇందులో ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



డాక్టర్ విజయ్‌మోహన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్న లింగంపెల్లి నర్సయ్య ఇటీవల తలనొప్పితో బాధపడటంతో రిమ్స్‌లో చేర్చారు. న్యూరో సమస్యతో బాధపడుతున్న తనకు డాక్టర్ విజయ్‌మోహన్‌రాజు తక్షణం సూపర్ స్పెషాలిటీలో బ్లడ్ క్లాట్ శస్త్ర చికిత్సను తన బృందంతో నిర్వహించి ప్రాణాలు కాపాడారు. అలాగే ఈ అరుదైన శస్త్ర చికిత్స జిల్లాలో మొట్టమొదటి కావడం విశేషం. నర్సయ్య కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ విజయ్ మోహన్‌రాజును బుధవారం శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నాండ్లీ అవస్థలు..?

- ఇచ్చోడలో రోడ్డు నిర్మాణ పనుల్లో తీవ్రజాప్యం
- పదమూడు నెలలు గడుస్తున్నా కొలిక్కిరాని వైనం
- ట్రాఫిక్ ఇబ్బందులు.. రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనాలు
- పనుల్లో వేగం పెంచడంలో అధికారుల అలసత్వం

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు ఇంకా పూర్తికావడం లేదు. పనులు ప్రారంభించి పదమూడు నెలలు గడిచినా కొలిక్కిరావడం లేదు. ఇప్పటికే పనులు పూర్తికావాల్సి ఉండగా.. ప్రభుత్వం మరో ఐదు నెలలు పొడగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. కేవలం రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఏడాది కాలం సమయం తీసుకోవడం ఏంటని అక్కడి జనాలతో పాటు రాకపోకలు సాగించే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు అస్తవ్యస్తంగా సాగుతుండటం.. రోజుల తరబడి జరుగుతుండటంతో రోజూ రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఓ బస్సు బ్రిడ్జి కోసం తవ్విన గుంతలో కూరుకుపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం 50శాతం పనులు కూడా పూర్తికావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం..గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా ఈ పనుల్లో వేగం మందగించిందనే ఆరోపణలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఇచ్చోడ

ఆదిలాబాద్- నిర్మల్ జిల్లాల మధ్యలో ఉన్న ఇచ్చోడ మండల కేంద్రం వాణిజ్య పరంగా..ప్రయాణాల పరంగా చాలా కీలకమైన ప్రదేశం. రోజూ వందలాది బస్సులతో పాటు ఇతరాత్ర వాహనాలు ఈ మండల కేంద్రం మీదుగానే వెళ్తుంటాయి. వ్యాపారపరంగానూ చాలా అభివృద్ధి చెందిన ప్రాంతం. మరోపక్క చుట్టుపక్కల పల్లెల నుంచి వేలాది మంది ఇక్కడకు వచ్చి వివిధ రకాల సరకులు..ఇతరాత్ర సామగ్రి తీసుకెళ్తుంటారు. కానీ మండల కేంద్రంలో చిన్న రోడ్డు ఉండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో రూ.13కోట్లతో 2.5కిలోమీటర్ల డబుల్ రోడ్డు మంజూరు చేసింది. మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి 44ను కలుపుతూ వెళ్లే ఈ రోడ్డుకు 2024 జనవరి 24న ప్రజాప్రతినిధులు, అధికారులు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు జరుగుతుండగా.. ఏడాది గడిచినా ఇంకా కొలిక్కిరావడం లేదు. వాస్తవానికి ఏడాదిలో పూర్తిచేయాలని నిబంధన ఉన్నా పనుల్లో తీవ్ర జాప్యం జరగడం మూలంగా అనుకున్న సమయానికి పూర్తికాలేదని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం మరో ఐదు నెలలు పాటు పనులు గడువును పొడిగించినట్లు అధికారులు చెబుతున్నారు. జులై 9తేదీ వరకు గడువు విధించినట్లు తెలిసింది. కానీ కేవలం రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికే ఏడాదికి పైగా సమయం తీసుకోవడంతో పనుల తీరుపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తరుచూ ట్రాఫిక్ సమస్యలు..!

ఇచ్చోడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న డబుల్ తారు రోడ్డు పనులు నెమ్మదిగా సాగడం.. ప్రత్యామ్నాయ దారి లేకపోవడంతో మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఓ పక్కన పూర్తయినప్పటికీ..మధ్యలో బ్రిడ్జి నిర్మిస్తుండటం కారణంగా అటువైపు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రోడ్డుపక్కన దుకాణాల మధ్య ఇరుకు సందుల్లోంచి వెళ్లాల్సి వస్తోంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చిన క్రమంలో ట్రాఫిక్ జాం అవుతోంది. క్లియర్ కావడానికి సుమారు అరగంట పాటు తిప్పలు పడాల్సి వస్తోంది. బస్సులు బస్టాండ్‌కు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చి జాతీయ రహదారి మీదుగా వెళ్తున్నాయి. మరోపక్క ఓ పక్కన మొరంపై కంకర వేసి ఉండటంతో దుమ్ముధూళి కారణంగా స్థానిక దుకాణదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇలా కేవలం రెండు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికే ఏడాదికి పైగా సమయం పట్టడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. త్వరగా పూర్తిచేయించాల్సిన అధికారులు సైతం మామూలు వ్యవహారంగా తీసుకుంటూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి : అన్నెల లక్ష్మణ్, డీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి



రోడ్డు నిర్మాణం ప్రారంభించి ఏడాది గడిచిపోయింది. ఇప్పటి వరకు కనీసం 50శాతం కూడా పూర్తికాలేదు. పనులు ఆలస్యం కావడం కారణంగా ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దుమ్ముధూళి కారణంగా అస్తమా రోగులు అవస్థలు పడుతున్నారు. అధికారులు దృష్టిసారించి రోడ్డు పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలి.

ఉపాధ్యాయుల వికృత చేష్టలు...విద్యార్థినులకు శాపాలు

- కీచకులుగా మారుతున్న కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు
- ఆరు నెలల్లో ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నవతెలంగాణ-మంచిర్యాల

విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పాల్సిన కొందరు ఉపాధ్యాయులు తమ వృత్తికే కలంకం తెస్తున్నారు. విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తూ సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన వారే కీచకులుగా మారుతున్నారు. చిన్న పిల్లలని కూడా చూడకుండా వారిపై వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. ఇటీవల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కొందరి ఉపాధ్యాయుల వెకిలి చేష్టలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు అడపాదడపా చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు అవేవీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.




గతేడాది దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రధాన అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించే ఓ టీచర్ తన సెల్‌ఫోన్‌లో విద్యార్థినుల ఫొటోలు తీసి వాటిని న్యూడ్ ఫొటోలుగా మార్చాడు. అమ్మాయిలతో అసభ్య పదజాలంతో మాట్లాడుతూ వాళ్ల చదువుకునే సమయంలో బోర్డుపై రాయిస్తూ, వారు ఇతర పనుల్లో ఉన్నప్పుడు వారి ప్రయివేట్ పార్ట్స్‌ను వీడియో తీశాడు. అనుకోకుండా ఉపాధ్యాయుడి ఫోన్ నుండి ఆ వీడియోలు బయటకు రావడంతో తోటి ఉపాధ్యాయులకు విషయం తెలిసింది. సమాచారం అందుకున్న అప్పటి ఉపాధ్యాయ సంఘానికి చెందిన ఓ జిల్లా నాయకుడు విద్యార్థినులను ఫోన్‌లో వీడియోలు తీసిన కీచక ఉపాధ్యాయుని వద్దకెళ్లి నీకేం సమస్య రాకుండా చూసుకుంటానని పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డాడు. ఆ నోటా ఈ నోటా ఈ విషయం జిల్లా విద్యా శాఖ అధికారికి చేరడంతో ఇరువురిని పిలిచి మందలించి వదిలిపెట్టాడు.

జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో తెలుగు పండిట్ ఉపాధ్యాయుడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించి, బాలికల తల్లిదండ్రుల చేతుల్లో చెప్పుదెబ్బలు తిన్నాడు. అనంతరం అతన్ని అధికారులు సస్పెండ్ చేశారు. నెల రోజుల క్రితం భీమిని మండలంలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు కూడా తన పాఠశాలలో చదివే విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యాడు.

తాజాగా జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నైతం శ్రీనివాస్‌పై అదే పాఠశాలలో పని చేస్తున్న ఓ మహిళా టీచర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పలువురు టీచర్‌లను, విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. శ్రీనివాస్ వ్యవహార శైలితో ముగ్గురు విద్యార్థినులు టీసీ తీసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది. టీసీ తీసుకొని వెళ్లిన బాలిక సోమవారం ప్రజావాణిలో ఉపాధ్యాయుడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తరగతి గదిలోకి తీసుకెళ్లి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు తనను బావ అని పిలవాలని డబుల్ మీనింగ్ డైలాగ్‌లతో విద్యార్థినులని చిత్ర హింసలకు గురి చేసినట్లు తెలుస్తోంది. ప్రిన్సిపాల్ నైతం శ్రీనివాస్‌పై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

అవగాహన కల్పిస్తున్నాం : ఎస్.యాదయ్య, జిల్లా విద్యాశాఖాధికారి



జిల్లాలో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం ఉపాధ్యాయులకు ట్రైనింగ్ కాసులు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తూ తోటి ఉపాధ్యాయురాళ్లతో, విద్యార్థినులతో తప్పుగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేసేలా మోటివేట్ చేస్తున్నాం. ఫిర్యాదు చేసిన వారి వివరాలు రహస్యంగా ఉంచి తప్పుడు పనులు చేసిన ఉపాధ్యాయులపై విచారణ జరిపి సస్పెండ్ చేస్తున్నాం.

కష్టపడితే మహిళలకు అన్నీ సాధ్యమే

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



ఆసిఫాబాద్ : మహిళలు నిర్ణీతమైన లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడితే సాధించలేనిదంటూ ఏమీ లేదని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో పైకి ఎదగాలంటే కలలసాకార పుస్తకాన్ని తెరవాలని, ఆ కలలో సాకారానికి పట్టుదలతో, సంకల్పంతో అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. అట్లాంటి వారికి ఎదురులేదన్నారు. మన మొట్టమొదటి డాక్టర్ అయిన ఆనందిబాయి, అదే విధంగా ఐపీఎస్ కిరణ్‌బేడీ, అంతరిక్ష యానంలో మొట్ట మొదటి మహిళ కల్పనా చావ్లాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి తన జీవితంలో ధర్మాన్ని, న్యాయాన్ని ఆచరిస్తూ ముందుకు సాగాలన్నారు. ధర్మం, న్యాయం అనేది మన ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని, సమాజంలో గౌరవాన్ని తెచ్చిపెడుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ మాట్లాడుతూ దేశ మొట్టమొదటి మహిళ ద్రౌపది ముర్ము ఇండియన్ ఐరన్ లేడి ఇందిరా గాంధీ, రాజుల కాలంలో రాణి రుద్రమదేవి, ఝాన్సీరాణి, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఇలాంటి మహామహుల ఆశయాలను మనం ఆదర్శంగా చేసుకొని ముందుకు సాగాలన్నారు. సిలబం(కర్రసాము) క్రీడాంశంలో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పథకాలను సాధించిన పులిశెట్టి శృతి, దుంతల వర్ష, ప్రపంచ స్థాయి హ్యాండ్ బాల్ కప్‌లో ఆదిలాబాద్ జిల్లా క్రీడా పథకాన్ని ఎగరవేసిన మడావి కరీనను శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ కోచ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రెఫ్రి బోర్డు చైర్మన్ చునార్కర్ అరవింద్, ఫుట్‌బాల్ కోచ్ రవి, సాగర్, ఖోఖో తిరుమల, గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు జంగు, అథ్లెటిక్ సాగర్, ఫుట్‌బాల్ కోచ్ రవి, ఖోఖో కోచ్, తిరుమల్, కోచ్ సాయి, హఫీజ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి అండగా నిలవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వృత్తి శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి అండగా నిలవాలని పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు అన్నారు. బుధవారం జన్ శిక్షన్ సంస్థన్ ఆధ్వర్యంలో మూడు నెలల వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. మహిళల ఆర్థిక స్వాలంబన జరగాలని దానికి వృత్తి నైపుణ్య శిక్షణలు ఎంతగానో ఉపయోగపడుతాయని జీఎం పేర్కొన్నారు. జన్ శిక్షణ్ సంస్థన్ 9 విభాగాల్లో మహిళలకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుంటూ వాటి ద్వారా చిన్న తరహా వ్యాపారం మొదలు పెట్టాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం మహిళల కోసం కొత్త పథకం రాజీవ్ యువ వికాస్‌ను ప్రకటించిందన్నారు. దాని విధివిధానాలు ఇంకా రాలేదన్నారు. వాటి గురించి తెలుసుకుంటూ సద్వినియోగం చేసుకుంటూ వ్యాపారాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జన్ శిక్షన్ సంస్థన్ చైర్మెన్ సురేందర్, డైరెక్టర్ శ్యామల, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

బయటి వ్యక్తులను నియమించడం సరికాదు



నస్పూర్: ఇటీవల ప్రచురించిన సింగరేణి ఉద్యోగ ప్రకటనలో సింగరేణి సంస్థలో విభాగ అధిపతులుగా బయటి వ్యక్తులను నియమించడం సరికాదని శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కష్ట కాలంలో(బిఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు) ఉద్యోగులు, అధికారులు సమిష్టి కృషితో సింగరేణిని లాభదాయకంగా మలుచుకున్నారని, ప్రస్తుతం 30సంవత్సరాల పైబడి అనుభవం ఉన్నవారిని, కంపెనీకి సర్వీస్ చేసినవారిని కాదని కొత్త పద్ధతిలో బయటి వ్యక్తులను నియమించడం అంకితభావంతో పని చేసే అధికారులను నిరుత్సాహపరిచేదిగాను, అభద్రతకు గురిచేసేదిగాను ఉందని పేర్కొన్నారు. బయట వ్యక్తులకు సంస్థలోని ప్రక్రియలు, పద్ధతులపై అవగాహన చాలా తక్కువగా ఉంటుందని, వారు ఇతర విభాగాలతో సమన్వయం చేయడం కూడా కష్టంగా ఉంటుందని తెలిపారు. ఇటీవల విడుదల చేసిన చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఉద్యోగ ప్రకటలను వెంటనే పున:పరిశీలించి ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు సత్యనారాయణ, కిరణ్‌కుమార్, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రామారావు పాల్గొన్నారు.

జైపూర్ : ఇటీవల ప్రచురించిన సింగరేణి ఉద్యోగ ప్రకటన(చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్స్, చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్) కాంట్రాక్టు పద్ధతి నియామకంపై పున:సమీక్షించాలని సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్ కోరారు. బుధవారం సింగరేణి సిఎండి ఎన్ బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఉద్యోగ ప్రకటన చూసి అధికారులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. సింగరేణి సంస్థలో విభాగ అధిపతులుగా, సర్వీస్ లేని బయటి వ్యక్తులను నియమించడం సరికాదన్నారు. సంస్థ భవిష్యత్తుపై పడే దుష్ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని పున:సమీక్షించి ప్రకటనను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు.

అనుమానాస్పద మృతిపై జడ్జితో విచారణ జరిపించాలి



ఆదిలాబాద్‌టౌన్ : ఇచ్చోడ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాలిక మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ విషయమై బుధవారం అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెడికల్ చెకప్ చేయించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాల వసతులపై తనిఖీలు నిర్వహించాలని కోరారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఏటీడీఓ, హెచ్ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని, ఐటీడీఎ పిఓ నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ సక్కు, గణేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆర్టీసీ డీఎం బదిలీ

- ఫలించిన కార్మికుల పోరాటం
- నవతెలంగాణ కథనానికి స్పందన





ఆసిఫాబాద్ : కొంతకాలంగా ఆర్టీసీ డీమ్ డ్రైవర్లను డీఎం వేధింపులకు గురి చేస్తున్నాడని ఇటీవల నవతెలంగాణలో 'ఆర్టీసీ డిఎంకు కార్మికులకు పెరిగిన దూరం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం విజిలెన్స్ అధికారులను డిపోకు పంపించి వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది. అనంతరం అధికారులు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న విశ్వనాథ్‌ను బోధన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న రాజేశ్వర్‌ను మేనేజర్‌గా నియమిస్తూ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులను భయబ్రాంతులకు, వేధింపులకు గురిచేసిన డీఎం విశ్వనాథ్‌పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటం చేశామన్నారు. న్యాయపోరాటం విజయవంతమైందన్నారు. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్తులోనూ పోరాటాలు చేస్తామని తెలిపారు. విశ్వనాథ్‌ను బదిలీ చేయడం కార్మికుల విజయమని పేర్కొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెంఛన్లు పెంచాలి : ఎంపీ వంశీకృష్ణ



జైపూర్ : సింగరేణి రిటైర్డ్ కార్మికుల పింఛన్లు పెంచాలని పార్లమెంటులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పార్లమెంట్ వేదికగా గళం విన్పించారు. 35 ఏళ్ల క్రితం పెద్దపల్లి ఎంపీ వెంకటస్వామి హయాం నుండి రిటైర్డ్ కార్మికులు పింఛన్లు పొందుతున్నారన్నారు. కానీ పింఛన్లు పొందుతున్న కార్మికుల్లో అత్యధికులు రూ.1500 తక్కువగా పొందుతుండడం బాధాకరమని పేర్కొన్నారు. జీవితాంతం దేశానికి వెలుతురు అందించిన రిటైర్డ్ కార్మికులు తగిన గౌరవంతో జీవించాలంటే వారి పింఛన్‌ను తక్షణమే రూ.10వేలకు పెంచాలని కేంద్రాన్ని కోరారు.

జన ఔషధి కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఉట్నూర్

పేద ప్రజల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన ఔషధీ పథకాన్ని ప్రవేశపెట్టారని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జన ఔషధీ కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాలు పేదలకు వరంగా మారాయని జన ఔషధీ కేంద్రాలపై బీజేపీ పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహనా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు కొండారి రమేష్, వెంకటేష్, మాజీ ఎంపీపీ పంద్రం జైవంతరావు పాల్గొన్నారు.

కళాశాలలో చేరాలంటూ క్యాంపెయిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం అడ్మిషన్స్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో కళాశాల సిబ్బంది ప్రభుత్వ బాలుర కళాశాల, విద్యార్థి జూనియర్ కళాశాల, విజేత జూనియర్ కళాశాల, ఇతర పరీక్షా కేంద్రాల వద్దకు బుధవారం వెళ్లారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు కళాశాల వసతులకు సంబంధించిన కరపత్రాలను అందజేసి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధనను జరుగుతుందన తెలియజేశారు. విద్యతో పాటు ఆటపాటల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెబుతూ కళాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యపకురాలు రేఖ, అనిత, స్వప్న సంతోషిని, సౌజన్య, సోనీ, భువన పూనం పాల్గొన్నారు.



ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-తాంసి

వ్యవసాయ భూముల్లో ఉన్నటువంటి బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకుంటే నీటి ఎద్దడి లేకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా రైతులకు సూచించారు. బుధవారం మండలంలో రైతులు వేసిన యాసంగి పంటలు భూగర్భ జలాలు అడుగంటికి పోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నట్లు వ్యవసాయ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వ్యవసాయశాఖ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. మొదటగా మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లి విద్యుత్ సరఫరా గురించి ఎస్ఈ, ఏఈని అడిగి తెలుసుకున్నారు. రైతులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎర్పడుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే విద్యుత్ సరఫరాకు అంతరాయానికి కారణాలను అడిగి తెలుసుకుంటూ రోజువారి విద్యుత్ సరఫరా రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు విద్యుత్ సమస్య లేకుండా చూసే బాధ్యత విద్యుత్ అధికారులదేనని అన్నారు. అనంతరం తాంసి మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తూ పాత ముత్తడి చెరువుకు నిధులు కేటాయించి, మరమ్మత్తుల చేసి పూడిక తీతతో పాటు చెరువులో నీటి నిల్వ ఉండే విధంగా చేసినట్లయితే భూగర్భ జలాలు పెరిగి బోర్ బావులు ఎండిపోకుండా ఉండటానికి ఈ చెరువు ఎంతో ఉపయోగపడుతుందని, రైతులకు మేలు చేసిన వారవుతారని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందించి చెరువు రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం వడ్డాడి మత్తడి వాగు సమీపానగల నీటి ఎద్దడితో ఎండిపోతున్న జొన్న పంటను పరిశీలించారు. రైతులు మత్తడి వాగు రైట్ పైపు కెనాల్ పూర్తి అయినప్పటికీ ఆ పైప్ లైన్‌తో రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని, రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని మత్తడి వాగు ప్రాజెక్ట్ దిగువ వాగులోకి నీటిని విడుదల చేస్తే రైతులు యాసంగి పంటలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రాజెక్ట్ అధికారులకు ఫోన్ చేసి రైతులకు అవసరమైన మేర నీటిని విడుదల చేయాలని వెంటనే తమను కలువాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో ఉన్నటువంటి బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, తమ బోరు బావుల్లో నీటి సామర్థ్యం మేరకే పంటలను వేసుకోవాలని సూచించారు. ముత్తడి వాగు లెఫ్ట్ కెనాల్ ఉన్నటువంటి పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు రైట్ కెనాల్‌ను రైతులకు ఉపయోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు విద్యుత్ సమస్య ఎట్టి పరిస్థితుల్లో ఉండవద్దని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీఏఓ శ్రీధర్ స్వామి, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఏఈ, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ మోహన్ రెడ్డి, ఏఓ రవీందర్, ఏఈఓ, రైతులు వినోద్‌రెడ్డి, రాజు, అశోక్, స్వామి ఉన్నారు.



విద్యుత్ సమస్యపై కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు

పదో తరగతి ఫలితాల్లో ముందుండాలి

- స్పెషల్ ఆఫీసర్ శంకర్



నవతెలంగాణ-కుభీర్

ఈనెల జరిగే పదో తరగతి పరీక్షల్లో నిర్మల్ జిల్లాలోనే కుభీర్ మండలం మొదటి స్థానంలో ఫలితాలు వచ్చేలా కృషి చేయాలనీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, స్పెషలాఫీసర్ శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని మలేగాం ఉన్నత పాఠశాలను సందర్శించి, పదో తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈనెల 21నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయంలో గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. వెనుక పడ్డ విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధా తీసుకుని వారికి మంచి మార్కులు వచ్చేలా చూడాలని అన్నారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షకీలా హైమద్, సీఆర్పీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఐసీడీఎస్‌కు రక్షణ కల్పించాలి



నవతెలంగాణ-ముధోల్

ఐసీడీఎస్‌కు రక్షణ కల్పించి బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ అనుబంధ సంఘమైన అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ముధోల్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం సీడీపీఓ సరోజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ ముధోల్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రజీయా, రేష్మా మాట్లాడారు. ఐసీడీఎస్ రక్షణ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ సమస్యలపైన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి 17, 18 రెండు రోజులు కలెక్టర్ కార్యాలయం ముందు 48 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. వంటావార్పు, రాత్రి బస కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వనిత, సావిత్రి, శ్రీదేవి, సహయ కార్యదర్శి నర్సమ్మ, కోశాధికారి మీనాక్షి పాల్గొన్నారు.

అంతర్జాతీయ కళా పోటీల్లో చంద్రశేఖర్‌కు అవార్డు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దేశంలోని కళాకారులు, ఐదు దేశాలకు పైగా ఎన్ఆర్ఐల మధ్య నిర్వహించిన సెషన్ 16వ అంతర్జాతీయ కళాపోటీల్లో పట్టణ వాసి ప్రతిభ కనబర్చాడు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన గాధరి చంద్రశేఖర్ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్నోవిజే గ్లోబల్ టాలెంట్ సెర్చ్ ర్యాంక్ స్లాట్ ప్రకారం ఐఏసీ నుంచి డ్రాయింగ్, పెయింటింగ్ విభాగంలో పాల్గొన్నారు. కాగా ఈ పోటీల్లో ది మెడల్ ఆఫ్ అప్రిషియేషన్‌తో పాటు ది లెటర్ ఆఫ్ రికగ్నిషన్ లెవల్-2లో ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నాడు. అర్హులైన కళాకారుల్లో ఒకరిగా పేరు సాధించుకున్నాడు. అవార్డు అందుకున్న ఆయనను, బంధు మిత్రులు, కాలనీవాసులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ఎల్‌జీ టీవీ అందజేత



నవతెలంగాణ-జైనథ్

విద్యార్థులకు డిజిటల్ తరగతుల దృష్ట్యా, శ్రవణ నైపుణ్యం పెరుగుతుందని డీఈఓ ప్రణీత అన్నారు. బుధవారం సాత్నాల మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామమైన జామిని గ్రామస్తులు ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.60వేల విలువైన ఎల్‌జీ టీవీని అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ డిజిటల్ తరగతులను టీవీ ద్వారా బొమ్మలతో కూడిన నీతి కథలు, పాఠ్యంశాలు, టీవీలో వచ్చే దృశ్యాలు కన్నులతో చూడటం, చెవులతో వినడం ద్వారా విద్యార్థుల మెదల్లో విన్న విషయం ఎప్పటికి నిక్షిప్తమై ఉంటుందని అన్నారు. విద్యార్థుల్లో వినూత్న, సృజనాత్మక బోధన పద్ధతులతో నూటికి నూరు శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరు అయ్యేటట్టు ప్రయత్నం చేస్తున్న ఊరు మెచ్చిన ఉపాధ్యాయులకు జామిని గ్రామస్తులు, మహాజన్, వీడీసీ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ దేవుబాయి, మహాజన్ కృష్ణ, మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్, మేడిగూడ రోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్లే, నారాయణ, జ్యోతి, జయశ్రీ, లక్ష్మణ్, గంగన్న, పెంటపర్తి ఊశన్న, మూనహిద్, అనుసూయ, పొచ్చిరాం, నైతం సోము, కాశీరాం, ధర్మ బహదూర్, రామకృష్ణ, విఠల్, యశ్వంత్, యాదవ్ పాల్గొన్నారు.

అసాంఘీక కార్యకలాపాలను రూపుమాపాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



చెక్‌పోస్టులను, టోల్ ప్లాజాను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జైనథ్

జిల్లా సరిహద్దుల్లో అసాంఘీక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జైనథ్ సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిప్పర్‌వాడ, పెన్‌గంగా, బోరజ్ చెక్‌పోస్టులను పరిశీలించారు. సుప్రసిద్ధ జైనథ్ లక్ష్మీనారాయణ ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకు నూతనంగా విచ్చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్ తనదైన శైలిలో జిల్లాలో ఆకస్మిక పర్యటనలతో పోలీసు యంత్రాంగం చేస్తున్న విధులను పరిశీలించారు. వివిధ కేసుల్లో లభ్యమైన వాహనాలపై సిబ్బందిని అడిగి ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో వచ్చే గ్రామాలు, మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న పోలీస్ స్టేషన్ల వివరాలు, నమోదయితున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్టేషన్ ఆవరణలో ఒక మొక్క నాటారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని తెలియజేశారు. రిసెప్షన్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ రికార్డులు, స్టేషన్ రికార్డులను, లాకప్, రైటర్, సాంకేతిక నిపుణుల కార్యాలయాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో ఆఫ్‌లైన్‌లో నమోదు చేస్తూ బాధితులకు సత్వర పరిష్కారాన్ని అందజేయాలని తెలిపారు. అనంతరం జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వచ్చే పిప్పర్‌వాడ టోల్ ప్లాజాను, పెన్‌గంగా వద్ద సరిహద్దును, బోరజ్ చెక్ పోస్ట్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, సీఐ డి. సాయినాథ్, ఎస్సై వి.పురుషోత్తం, పీఎస్ఐ మధు కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం లేదు

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

స్త్రీ పురుషుల మధ్య సమానత్వం లేదని ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అన్నారు. బుధవారం వైయస్సార్ కాలనీలో మహిళా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐద్వా దేశవ్యాప్తంగా మహిళల్ని సమీకరించి, మహిళల సమస్యల పరిష్కారం కోసం ఒక బలమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించడం కర్తవ్యంగా పెట్టుకుందన్నారు. స్త్రీ పురుషుల అసమానత్వాన్ని తొలగించడం కోసం, అలాగే ప్రజాస్వామ్యం సమాన హక్కుల కోసం, సమాజంలో ఉన్న అన్ని రకాల అణిచివేతల్ని తొలగించడం కోసం ఈ సంఘం పనిచేస్తుందని ప్రకటించారు. దేశానికి కొన్ని దశాబ్దాల కిందటే స్వాతంత్ర్యం వచ్చిన భారత రాజ్యాంగంలో స్త్రీ కీ అనేక హక్కులను కల్పించినా ఇప్పటికీ సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు. స్త్రీ పురుషుల మధ్య సమానత్వం లేదని, విద్య వైద్యం ఉపాధిలో సంస్కృతికంగా కూడా స్త్రీలు ఇంకా వెనకబడి ఉన్నారు. చట్టరీత్యా హక్కులున్నా అవేవీ కూడా స్త్రీలకు అందుబాటులో లేవన్నారు. వీటికి తోడు అత్యాచారాలు, వరకట్న మరణాలు, కుటుంబంలో హింస బలవంతపు పెండ్లిలు, బాల్యవివాహలు, బహుభార్యత్వం వంటి అనేక సమస్యలు స్త్రీలను వేధిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో స్త్రీలు తమకు తాము సంఘటితం కావాలన్నారు. తామే కాకుండా ఇతర ప్రజాసంఘాలతో కార్మికులు, రైతుల, యువత, విద్యార్థులు వంటి సాధారణ ప్రజాసంఘాలతో కలిసిమెలిసి పనిచేస్తూ, ప్రజల హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, ఉపాధ్యక్షులు బి.లలిత, సుజాత పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలి



సైబర్ క్రైమ్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుంచే పూర్తి అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబుల్ల అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల నుంచి అవగాహన ర్యాలీని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. వాటి గురించి తెలియక అమయాక ప్రజలు నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల గురించి తెలుసుకుంటూ వాటిని ఇతరులకు తెలియజేస్తూ, చైతన్యవంతులను చేయాలన్నారు. అందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల రోజుల పాటు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, ఏఎస్సై ఖైసర్, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగహన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పెర్కగూడ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మూడవత్ రాజు, ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్‌ల ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ లావాదేవీలపై అవగాహనా కల్పించారు. ముఖ్యఅతిథిగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ రాయుడు పాల్గొని ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా చాలా మోసాలు జరుగుతున్నాయని, ఫోన్లలో ఎలాంటి లింకులను క్లిక్ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో టీజీబీ బిజినెస్ సీనియర్ మేనేజర్ ప్రభుదాస్, ఏపీఎం సెర్ప్ సూర్యకాంత్, షేక్ అబ్దుల్, ఫీల్డ్ మేనేజర్ సీసీలు జాదవ్ దశరత్, అరుణ్, సులోచన, బ్యాంక్ ఖాతాదారులు వీఓ లీడర్‌లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని శంకర్‌గూడలో ఈనెల 2న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని సింగర్‌వాడికి చెందిన ఇతను ఇటీవలే బ్రతుకు తెరువు కోసం తమ దగ్గరి బంధువుల ఇంటికి వచ్చాడు. రోజు కూలీ చేసుకునేవారు. ఈ క్రమంలో భార్య భర్తల మధ్య గొడవ జరుగడంతో ఈ నెల2న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. అప్పటి నుంచి రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడని తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై అశోక్ తెలిపారు.

లక్ష్యంతో చదివి సాధించాలి : జడ్పీ సీఈఓ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి సందర్శించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతిగదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ నేటి నుంచే విద్యార్థులు మంచి లక్ష్యంతో చదివి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. పదో తరగతి పరీక్షల్లో నిర్భయంగా మంచి రాతతో జవాబులు రాయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జీ ఎంఈఓ వెంకట్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, ఉపాధ్యాయులు ఉన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | మార్చి 13, 2025 | www.navatelangana.com

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్క ఉపాధి కూలీ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. బుధవారం మండలంలోని లోడ్పల్లి గ్రామపంచాయతీలో ఉపాధి హామీలు నీటి సంరక్షణ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కనీసం రూ.200 నుండి రూ. 300 వరకు వేతనం పడేలాగా కొలతల ప్రకారం పని చేయాలని కూలీలకు సూచించారు. నర్సరీ సందర్శించి మొక్కలు వంద శాతం జర్మినేషన్ వచ్చేలా జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయనతోపాటు ఈసీ జైహింద్, టీఏ మహేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, శ్రీధర్, ఎఫ్ఏలు రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.

అక్రమంగా కలప రవాణ చేస్తే చర్యలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



అక్రమంగా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ తెలిపారు. కర్జెల్లిరేంజ్‌లోని దిందాబీట్ పరిధిలో దిందా గ్రామానికి చెందిన డగే సురేష్ అక్రమంగా ట్రాక్టర్‌లో కలప రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి దాడి చేసి పట్టుకోవడం జరిగింది. సుమారు రూ.30 వేల విలువ చేసే టేకుమొద్దు ట్రాక్టర్ ట్రాలీలో లభించగా ట్రాక్టర్ సీజ్ చేసి, రవీంద్రనగర్ -1 అటవీ కార్యాలయానికి తరలించామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఈ దాడుల్లో కర్జెల్లి, సిర్పూర్(టీ) అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ కెరమెరి

రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండలంలోని ధనోరా వద్దగల డబ్ల్యూటీపీని సందర్శించి మిషన్ భగీరథ ఈఈ రాకేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామానికి భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించడంతో పాటు వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రానున్న వేసవిలో అనుసరించాల్సిన విధానానికి సంబంధించి కిందిస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత భగీరథ అధికారులపై ఉందని తెలిపారు. వేసవి దృష్ట్యా తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను మిషన్ భగీరథ ఈఈ రాకేష్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన బాలికల క్రీడాభివృద్ధికి కృషి

- డీటీడీఓ రమాదేవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన బాలికల క్రీడాబివృద్ధికి కషి చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలల్లో ఖాళీల భర్తీ కోసం జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రీడలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఏకైక బాలికల క్రీడా పాఠశాలలో ప్రవేశాల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అమ్మాయిలు విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఆసిఫాబాద్ క్రీడా పాఠశాల మొదటి స్థానంలో ఉందని, ముందు క్రీడా పాఠశాల నుండి అంతర్జాతీయ క్రీడాకారులు తయారు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి మాట్లాడుతూ నాలుగు జిల్లాల నుండి 40 సీట్ల కోసం నిర్వహించిన తొమ్మిది రకాల ఎంపిక పోటీల్లో 60 మంది పోటీపడ్డారని 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం 80 మంది పోటీ పడ్డారని తెలిపారు. ఎంపిక ప్రక్రియలు 40 మంది పీఈటీలు పాలుపంచుకున్నారని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మంచిర్యాలలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో తిర్యాని గిరిజన ఆశ్రమ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు గుండం లక్ష్మణ్ మిస్టర్ ఆదిలాబాద్ టైటిల్ ని సొంతం చేసుకున్నందుకు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్దవ్, ఎటీడీఓ చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు జంగు, మంచిర్యాల జిల్లా క్రీడల అధికారి బండ జీవ రత్నం, పేట సెక్రెటరీ కష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు మధుసూదన్, శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు షేకు, వెంకటేష్, రాజేంద్ర ప్రసాద్, సుందర్ సింగ్, అరవింద్, సంగీత, గంగ భవాని, రాజ్ కుమార్, సంగీత, హీరాబాయ్, సుజాత, రవీందర్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలను విరాళంగా అందజేసిన పూర్వ విద్యార్థి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థి మండోకర్ దామోదర్ పాఠశాల అభివృద్ధిలో భాగంగా తన వంతుగా రూ.10,000 విలువ చేసే 20 కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా తన ఔదార్యానికి కృతజ్ఞతగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు పాల్గొనడం శుభ పరిణామమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగరాజు, సంతోష్, వెంకట్‌రావు, రామారావు, కలిమొద్దీన్, మమత, కళ్యాణి, నుజహాత్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ యజమాలకు పూర్తి హక్కు పొందెందుకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకువచ్చిందని, గత సంవత్సరం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న యజమానులు సద్వినియోగపరుచుకోవాలని గ్రామ కార్యదర్శి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ కోసం 140 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ఫ్లాట్ యజమానులు ఈనెల 31లోపు ఫీజు చెల్లించి 25శాతం రాయితీ పొంది ప్లాట్ ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

ఉపాధి హామీ కూలీలు వర్సెస్ అటవీ అధికారులు

- ఉపాధి హామీ పనులు అడ్డుకున్న బీట్ అధికారి
- అడ్డుకోవడానికి మీరెవరంటూ అటవీ సిబ్బందిపై ఎంపీడీఓ ఆగ్రహం
- పోలీసు స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు



రూరల్ ఎస్ఐ సందీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీడీఓ, ఉపాధి హామీ కూలీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలో బుధవారం ఉపాధి హామీ కూలీలు, అటవీ అధికారులకు మధ్య తీవ్ర రభస చోటు చేసుకుంది. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉపాధి హామీ కూలీ పనులు చేపడుతున్నారంటూ అటవీ బీట్ అధికారి రవి పనులు అడ్డుకోగా, విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లిన ఎంపీడీఓ రమేష్, ఏపీఓ బుచ్చన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ అటవీ అధికారుల తీరు పట్ల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీలు తెలిపిన ప్రకారం కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి గ్రామానికి చెందిన సుమారు 50 మంది కూలీలు బుధవారం మండలంలోని దరిగాం వెళ్లే దారిలో ఉన్న కెనాల్ వద్ద ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఒక వాహనంలో కూలీలు అక్కడికి వెళ్లి గుంతలు తవ్వుతున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన బీట్ అధికారి రవి కూలీల పనులు అడ్డుకోవడమే కాకుండా వీరిని తరలించిన వాహనం తాళం చెవులను గుంజుకొని వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ రమేష్, ఏపీఓ బుచ్చన్న, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్‌లు వెళ్లి కూలీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ రమేష్ బీట్ అధికారి రవికి ఫోన్ చేసి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉపాధి హామీ పనులను ఎలా అడ్డుకుంటావంటూ మందలించారు. అయినా బీట్ అధికారి వినకపోవడంతో వీరంతా రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సందీప్‌కుమార్‌కు పరిస్థితి వివరించారు. బీట్ అధికారి తనను దుర్భాషలాడాడంటూ ఎంపీడీఓ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు ఎంపీడీఓ రమేష్ తనను ఫోన్‌లో తిట్టాడంటూ బీట్ అధికారి రవి కూడా ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

మేం మొదలుపెడితే మీరెక్కడికీ సరిపోరు : అటవీ శాఖను హెచ్చరించిన ఎంపీడీఓ రమేష్

పంచాయతీరాజ్‌శాఖతో అటవీ శాఖ ఘర్షణ పడడం సరికాదని, రాష్ట్రంలోనే అత్యధిక సిబ్బంది ఉన్న శాఖ తమదని, మేం మొదలుపెడితే మీరెక్కడికీ సరిపోరు అంటూ అటవీ శాఖాధికారులకు కాగజ్‌నగర్ ఎంపీడీఓ రమేష్ ఘాటైన హెచ్చరిక చేశారు. అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేతకు గురవుతున్నా చర్యలు తీసుకోని అటవీ శాఖ బుధవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్న మహిళలను దుర్భాషలాడడం ఎంతవరకు సరైందని అన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం తాము పని చేసుకుంటూ పోతున్నామని, అటవీ అధికారులు మారినంత మాత్రాన నిబంధనలు కూడా మారిపోతాయా అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉపాధి హామీ పనులు చేపడుతున్న మహిళలను మీరు తిడుతున్నారని, అదే పంచాయతీరాజ్ శాఖ తలుచుకుంటే మీరు ఉండగలరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా 2.50 లక్షలకు పైగా సిబ్బంది ఉన్న శాఖ తమదని, అదే తాము అటవీ శాఖకు వ్యతిరేకంగా పోరాడితే మీ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అటవీ శాఖ మంత్రి కాని, పీసీసీఎఫ్ కాని ఎవరైనా కాని మీ శాఖ సిబ్బందిని కంట్రోల్‌లో ఉంచుకోవాలని సూచించారు. మహిళలను తిట్టిన అటవీ శాఖ కిందికి దిగి వచ్చి వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



పనులు నిలిపివేయడంతో భయం భయంగా మహిళా కూలీలు

పోలీస్ కుటుంబాల ఆరోగ్యానికి అండగా ఉంటాం

- ఎస్పీ డీవి.శ్రీనివాసరావు



ఆసిఫాబాద్ : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పోలీస్ శాఖలో పనిచేస్తున్న పోలీసులు, వారి కుటుంబాల ఆరోగ్యానికి అండగా ఉంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లో హైదరాబాద్ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్ష, పల్స్ రేట్, 2డి ఎకో లాంటి పరీక్షలతో కూడిన ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే విధులు సమర్థవంతంగా నిర్వహించగలుగుతారన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసే పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత జీవితంలో ఆరోగ్యానికి వ్యాయామం కోసం సమయం కేటాయించాలని కోరారు. డిజిటల్ ఆటల నుండి గ్రౌండ్‌లో ఆటలు వాడే అలవాటును పిల్లలకు వారి తల్లిదండ్రులే అలవర్చాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ ప్రభాకరరావు, డీసీఆర్‌బీ డిఎస్పి కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆసిఫాబాద్ సీఐ రవీందర్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, జిల్లా పోలీస్ సంఘం ప్రెసిడెంట్ విజయ శంకర్ రెడ్డి, జనరల్ మేనేజర్ విజయ్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ ఆర్థో సర్జన్ డాక్టర్ విశ్వనాథ్, సీనియర్ ఆప్తమాలజిస్ట్, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జైనూర్ : ప్రజలతో మమేకమై సేవ చేయడం పోలీసుల బాధ్యతని ఎస్పీ డీవీ.శ్రీనివాస్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో ప్రతిమ హాస్పిటల్ కరీంనగర్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపును మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద గల మైదానంలో నిర్వహించారు. దీనికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉంటారని, జైనూర్ గ్రామీణ ఆదివాసీ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సదుపాయం చాలా దూరంగా ఉందన్నారు. పేదవారికి వైద్యం అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతోనే ప్రతిమ హాస్పిటల్ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో ఉంటే ఆ ప్రాంత ప్రజలు అభివృద్ధివైపు అడుగులు వేస్తారని, మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించామని వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు చేయొద్దని, గంజాయి పంట పండించడం, రవాణ చేయడం చట్ట విరుద్ధమన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు విని మోసపోవద్దని, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనపడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు కాల్ చేయాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో ప్రతిమ ఆస్పత్రి వైద్యులు కౌశిక్, గీతారెడ్డి, అవినాష్ కుమార్, డా.విశ్వంత్, డా.శ్రావణ్ కుమార్, డా. రవీనా, రోషన్ రాజ్ 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, సీఐ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ అను పటేల్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఎస్ఐలు గంగన్న, రామకృష్ణ పాల్గొన్నారు.



జైనూర్ : హెల్త్ క్యాంప్‌లో మందులు అందిస్తున్న ఎస్పీ

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని, సకాలంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండలంలోని గోయగాం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు, నాణ్యత గల నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు వినియోగించాలని, గ్యాస్ స్టవ్‌పై వంట చేయాలని సూచించారు. పాఠశాలలో వంటశాల నిర్మాణం చేపట్టి వేసవి సెలవుల అనంతరం పాఠశాల ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేసవికాలం అయినందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మూత్రశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. 10వ తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును పరిశీలించి వార్షిక పరీక్షలలో 100 ఉత్తీర్ణత సాధించాలని, గణితం సబ్జెక్టుపై విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలపై విద్యార్థులలో ఎలాంటి ఒత్తిడి లేకుండా, సబ్జెక్టుల వారీగా విద్యార్థులు చర్చించుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆడే ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

హత్యా..? ప్రమాదమా..?

- మృతదేహాన్ని పోస్టుమర్టానికి పంపిన పోలీసులు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుండాయిపేట్ గ్రామానికి చెందిన దుర్గం కారు (60) మృతి చెందిన సంఘటన అనుమానాస్పదంగా మారింది. కారు సోమవారం రాత్రి ఇంట్లో పడి గాయాలై మృతి చెందినట్లు కుటుంబీకులు మంగళవారం దహన సంస్కారాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకోగా ఈ విషయం పోలీసులు తెలుసుకొని మృతుని ఇంటికి వచ్చి దహన సంస్కారాలను అడ్డుకొన్నారు. మృతుని కొడుకులు కొట్టి చంపినట్లు పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ముత్యం రమేష్ అక్కడికి చేరుకోని కుటుంబీకులను విచారించారు. కుటుంబీకుల సమాధానాలు అనుమానంగా ఉండడంతో శవాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్(టీ) సామాజిక ఆస్పత్రికి తరలించాలని చెప్పిన వారు ఒప్పుకోలేదు, రెవెన్యూ అధికారుల సహకారంతో శవాన్ని మంగళవారం సాయంత్రం పోస్టుమార్టం చేయడానికి తరలించారు. రిపోర్టు వచ్చిన తర్వాత అసలు విషయం బయట పడనుంది.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి బస్సులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని బుధవారం మండలంలోని గోయగాం వద్ద ఆబ్కారీ శాఖా అధికారులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ ఇన్‌చార్జి సీఐ రమేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు గోయగాం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో చంద్రపూర్ నుంచి గడ్చిరోలి జిల్లా సిర్వంచకు తరలిస్తున్న మహారాష్ట్ర మద్యం పట్టుబడింది. 90 ఎంఎల్ దేశీదారు బాటిళ్లు 1010, 2లీటర్ రాయల్ స్ట్రాంగ్ 11 బాటిళ్లు, 2 లీటర్ ఐబీ ఒక బాటిల్, ఒక లీటర్ ఆఫీషియల్ ఛాయిస్ బాటిల్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.58,970 ఉంటుందని, మద్యాన్ని తరలిస్తున్న గడ్చిరోలి జిల్లా అమరావతికి చెందిన తిరుమల్, కుమ్మరి బానయ్య, జ్యోతి, దినేష్ కుంభారే, సుమలత, కిష్టయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న వారిలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్ల ధన్ రాజ్, రజిత ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రైడేను పురస్కరించుకొని పాఠశాలలో గణితమేళాను నిర్వహించారు. పాఠశాల గణిత ఉపాధ్యాయులు సంతోష్, లక్ష్మి ఆధ్వర్యంలో గణిత ప్రయోగశాలలో గణితమేళాను ప్రదర్శించడం జరిగిందని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు విజయనిర్మల తెలిపారు. ఈ గణితమేలకు ముఖ్యఅతిథిగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు హాజరై మేళాను తిలకించారు. గణితమేళాలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు యాదగిరి, భాషా, గంగాభవాని, ఈశ్వర్ రావు, ధనరాజ్, భాగ్య, నాగరాణి, భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

- ఎంఈఓ గావుడె హనుమంతు



నవతెలంగాణ-కౌటాల

విద్యాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. బుదవారం మండలంలోని ఎంపీపీఎస్ ఇప్పలగూడ, నదిమాబాద్ పాఠశాలను సందర్శించారు. ఇప్పలగూడ పాఠశాలలో ఉపాధ్యాయుడు నవీన్ కత్యాల ద్వారా బోధన చేస్తుండటం పట్ల అతన్ని అభినందించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పాటించి రుచికరమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కౌటాల పదవ తరగతి విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం రైస్ అహ్మద్‌కు సూచించారు.

ఎంజేబీపీలో మాక్ పోలింగ్

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే ఇంగ్లీష్ మీడియం విద్యాలయంలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు వారి వారి పార్టీ గుర్తులతో, మేనిఫెస్టో హామీలతో ఎన్నికల్లో పోటీ చేశారు. చదువుతో పాటు విద్యార్థులకు ఓటింగ్, ఇతరతలపై అవగాహన కలిగి ఉండాలని మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వసంత్ తెలిపారు. ఉపాధ్యాయుడు రాజారాం ఆధ్వర్యంలో మాక్‌పోలింగ్ కొనసాగింది. ఎంఈఓ డాక్టర్ సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రయత్నాన్ని మెచ్చుకోవడమే కాకుండా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓను సన్మానించారు. ఇందులో పాఠశాల చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

నవతెలంగాణ-తాండూర్



రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అందరూ సత్ప్రవర్త కలిగిఉండాలని, శాంతిభద్రల భద్రతలకు నిఘాతం కలిగి విధంగా ప్రవర్తించొద్దన్నారు. భూతగాదాలు, కుటుంబ, కుల పంచాయతీల్లో తలదూర్చొద్దన్నారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిన విధంగా ప్రవర్తిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రమశిక్షణతో కుటుంబ బాధ్యతలను పాలుపంచుకుంటూ సాంఘిక జీవనం గడిపిన వారి రౌడీ షీటర్లను తొలగిస్తామని తెలిపారు. ఆయనతో రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్సైలున్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-జన్నారం



పెండింగ్ బకాయిలను చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మండల మాజీ సర్పంచ్లను పోలీసులు బుధవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ మాట్లాడుతూ సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే ఇప్పటివరకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. అప్పులకు మిత్తిలు కట్టలేక సర్పంచుల బ్రతుకులు అగమ్య గోచరంగా మారాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంతోష్, రవి, పోలీసులు పాల్గొన్నారు.

మూత పడిన గనిని సందర్శించిన కోల్ కంట్రోల్ అధికారులు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో మూత పడిన ఆర్కే 8 గనిని, జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ఓఎస్డీ కోల్ కంట్రోల్ నాగ్‌పూర్ రీజియన్ సందీప్ ఎస్ పరాంజపే, ఓఎస్డీ కోల్ కంట్రోల్ కొత్తగూడెం రీజియన్ సుబ్రమణ్యం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మూతపడ్డ గని పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పనులు పరిశీలించారు. గనిలో నాటిన మొక్కలను, ఎదిగిన వృక్షాలను చూశారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలు వాటి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షణ కంచేలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గని ముఖద్వారాలను, మూసి వేయబడిన ఎయిర్ షాఫ్ట్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ కె రాజేందర్, కార్పొరేట్ అడిషనల్ మేనేజర్ ఎన్విరాన్మెంట్ వి.తిరుపతి, అడిషనల్ మేనేజర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కార్పొరేట్ జి బాబ్జి, కార్పొరేట్ డీవై ఎస్ఎస్ఓ, ప్రాజెక్టు ప్లానింగ్ ఎం శేఖర్, మేనేజర్ ఆర్కే7 తిరుపతి, ఎస్టేట్స్ మేనేజర్ కె వరలక్ష్మి, మేనేజర్ ఫారెస్ట్ బి.చంద్రమణి, ఏరియా ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ బి హనుమస్ గౌడ్, సీనియర్ సర్వే అధికారి ఏ కిరణ్ కుమార్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ మేఘన, ఆర్కే7 గని ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ జగదీశ్వర్ రావు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి



నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీలలో ఇంటి పన్నుల వసూల్లో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం మండలంలోని కిష్టంపేట, తాండూర్, రాజీవ్‌నగర్ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ రికార్డులు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని సూచించారు. పంచాయితీలలో ఇంటి పన్నులు 100శాతం వసులయ్యేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో రికార్డులను తనిఖీ చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించిన 7 రిజిస్టర్‌లను చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జి.అనీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఎం.ఉదయ్ కుమార్, డి.దివాకర్, రమాదేవి పాల్గొన్నారు.

కిష్టాపూర్ కేజీబీవీలో ట్వినింగ్ స్కూల్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ కేజీబీవీ, మండలంలోని రేండ్లగూడ ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ట్వినింగ్ ఆఫ్ స్కూల్ ప్రోగ్రాం నిర్వహించారు. బుధవారం రేండ్లగూడ పాఠశాల విద్యార్థులు, కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌కి వెళ్లి ఆ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, హాస్టల్ విద్యార్థుల పరిస్థితులు, విద్యా బోధన, భోజన సౌకర్యాలు వివిధ అంశాలను కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణిని అడిగి తెలుసుకున్నారు. భోజన వసతుల గురించి పూర్తి వివరాలుసేకరించారు. రేండ్లగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు విమల సుజాత శ్రీలత మంజుల ఉన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు పొలం బాట



నవతెలంగాణ-లక్షెట్టిపేట

రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పొలంబాట నిర్వహించారు. రైతులు, విద్యుత్ సిబ్బంది కలిసి వంగిన పోల్స్ సరి చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, లూస్ లైన్స్ సరి వంటివి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ గణేష్ మాట్లాడుతూ రైతులు పొలాల్లో మోటార్లకు కెపాసీటర్లు అమర్చుకోవాలని, తద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఏమైనా సమస్యలు విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని, అగ్రికల్చర్‌కు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమన్నారు. ఫోర్‌మెన్ నర్సింగరావు, లైన్‌మెన్ శ్రీనివాస్, సాదయ్య, అసిస్టెంట్ లైన్‌మెన్ రంజిత్, అనిల్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్త గనులతోనే సింగరేణి సంస్థ మనుగడ

- వేజ్‌బోర్డ్ శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

నవతెలంగాణ-నస్పూర్

కొత్త గనులు వస్తేనే సింగరేణి సంస్థ మనుగడ కొనసాగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు, వేజ్ బోర్డ్ శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ-3 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను నూతన బొగ్గు బ్లాక్‌ల వేలంపాటలో పాల్గొనేందుకు అనుమతిని ఇవ్వాలన్నారు. సింగరేణిలో ఇంకో 10 సంవత్సరాలల్లో చాలా గనులు మూతపడుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన బొగ్గు గనుల చట్టం ప్రకారం కొత్త గనులు కావాలంటే సింగరేణి సంస్థ వేలంపాటలో పాల్గొని నూతన గనులను దక్కించుకోవడం ద్వారానే సింగరేణి సంస్థ మనుగడ కొనసాగుతుందన్నారు. అదేవిధంగా సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు 5 సంవత్సరాల నుండి స్ట్రక్చర్ సమావేశాలు లేకపోవడంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, తాము గెలిచిన వెంటనే యాజమాన్యంతో మాట్లాడి స్ట్రక్చర్ సమావేశం, జేసీసీ సమావేశాలు ఏర్పాటు చేయించామని తెలిపారు. దీనిపై కూడా కొన్ని కార్మిక సంఘాలు విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికుల ముఖ్య సమస్య అయిన అలవెన్సులపై ఆదాయ పన్ను చెల్లింపు, సొంత ఇంటి పథకం అమలు, మారు పేర్లతో విజిలెన్స్ బాధితుల డిపెండెంట్ ఉద్యోగాలు, ఏదైనా కారణాల చేత డిస్మిస్ అయిన కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని, మైనింగ్ టెక్నికల్, సూపర్‌వైజర్లకు అండర్ గ్రౌండ్ మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేస్లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని, కోల్ ఇండియాకు సంబంధం లేకుండా 11 రకాల అలవెన్స్ పెంచేందుకు యాజమాన్యాన్ని ఒప్పించామన్నారు. భవిష్యత్తులో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని వారి సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్, ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి, దాడి రాజయ్య, తవటం మల్లేష్, ఆడేపు సురేష్, గోపి , యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝ

నవతెలంగాణ-మంచిర్యాల



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న సీపీ

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా రామగుండం కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌లు పని చేస్తున్నారని సీపీ అంబర్ కిషోర్ ఝ అన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలతో పాటు పోలీస్ స్టేషన్ నిర్వహణ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, రౌడీ షీటర్ల బైండోవర్లు, కౌన్సెలింగ్ మొదలైన విషయాలపై పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల పట్టణం ప్రధానమైందని, శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ విషయంపై అధికారులకు సూచనలు అందించారు. ప్రజలకు ఉత్తమైన, పారదర్శకత, చట్ట బద్ధతతో ఉత్తమ సేవలు అందించడంపై చర్చించారు. మంగళవారం రాత్రి రామగుండం, గోదావరిఖని ప్రాంతంలో తనిఖీ చేశారు. పెట్రో కార్ సిబ్బందిని తనిఖీ చేసి అలర్ట్ చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పారిశ్రామిక ప్రాంతం ఎక్కువగా ఉందని రాత్రి సమయంలో డ్యూటీలకు వెళ్లే వాళ్లు, ఇతర వ్యాపారం నిమిత్తం బయట తిరుగుతూ ఉంటారన్నారు. ప్రజల సేఫ్టీ అండ్ సెక్యూరిటీకి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పట్టణ సీఐ ప్రమోద్ రావు, మహిళా పోలీస్ ఇన్స్‌పెక్టర్ నరేష్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సుల ద్వారా ఆర్థిక ప్రయోజనం



సింగరేణి డైరెక్టర్ సతీమణిని సన్మానిస్తున్న సేవా అధ్యక్షురాలు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వృత్తి శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న వివిధ కోర్సుల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందాలని డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ సతీమణి మాలతీ అన్నారు. బుధవారం నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయిలో వృత్తి శిక్షణ కోర్సుల ముగింపు కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు ఉమారాణి, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ మహిళలు వివిధ శిక్షణ కోర్సులను నేర్చుకోవడం అభినందించదగిన విషయమని, సింగరేణి సేవా సమితి మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. అలాగే మహిళలు ఎవరైనా ఇతర కోర్సులను నేర్చుకోవడానికి ముందుకు వస్తే వాటిని పరిశీలించి వచ్చే ఆర్థిక సంవత్సరం ఆ కోర్సులు నేర్పించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సేవా అధ్యక్షురాలు ఉమారాణి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో 619 మంది వివిధ వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకోవడం అభినందనీయమన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా మరింత మంది మహిళలు కోర్సులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపించాలని సూచించారు. ఇలాంటి కోర్సులను సద్వినియోగం చేసుకుంటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్నారు. సింగరేణి సంస్థ తరపున మహిళలకు ఉచితంగా వృత్తినైపుణ్య శిక్షణలు అందించడం అభినందనీయమన్నారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో అత్యంత ఎక్కువ మంది వృత్తి శిక్షణ కోర్సులను నేర్చుకుంటారని, వారికి సింగరేణి యాజమాన్యం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని వీటిని ప్రతి ఒక్క మహిళ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, సీనియర్ పిఓ పి కాంతారావు, సేవ సెక్రటరీ కొట్టే జ్యోతి పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ-మంచిర్యాల



వేడుకల్లో మహిళలను సన్మానించిన వాసవి క్లబ్ సభ్యులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వైశ్యభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి మహిళలందరికీ వివిధ రకాల ఆటల పోటీలు, స్కిట్లు డాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. ఇందులో మహిళా నాయకురాలు మాదంశెట్టి రమాదేవి, కొండ పద్మ ప్రముఖ వైద్య నిపుణురాలు గోలి శృతి, నృత్య గురువు చిదానందకుమారి, అటవీశాఖ అధికారి సాగరిక, మంచిర్యాల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు స్వప్న, శిరీష, ఉపాధ్యాయురాలు మంచాల శైలజ, మల్యాల సుష్మ, ముక్త రమాదేవి, కేశెట్టి మాలతి, రావుల శ్రీదేవి, వాసవి వనిత క్లబ్‌కు గతంలో అధ్యక్షులుగా సేవలను అందించిన సిద్ధంశెట్టి మధుశ్రీ, నల్మాస్ లావణ్య, నాగిశెట్టి జ్యోతి, చిలువేరు జ్యోతి, నరేందుల భవాని, మోటూరి సరితను ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం మహిళాలు పురుషులతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారికి సమాజంలో సరైన గౌరవం ఇవ్వాలన్నారు. అనంతరం మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ మహిళా దినోత్సవ వేడుకలలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, కార్యదర్శి కుకుడపు గాయత్రి, కోశాధికారి గుండా సునీత, రీజియన్ చైర్మన్ కేసెట్టి వంశీకృష్ణ, జోన్ చైర్మన్ రావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-మంచిర్యాల

ఏప్రిల్ 11న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా సంస్థల్లో మతోన్మాదాన్ని ప్రేరేపించే విధంగా ప్రయత్నాలు చేస్తుందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా తీసుకువచ్చిన ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. పేద విద్యార్థులకు ఉచిత, న్యాయమైన, మౌలిక వసతులు కూడిన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దుచేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ నాయకులు యకులు సుమంత్, మహేష్, జతిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకి పరీక్ష ప్యాడ్లు ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. సందెల మహిర జన్మదినం సందర్భంగా మందమర్రి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఐ రాజశేఖర్ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించాలని, చెడు మార్గంలో వెళ్లకుండా ఉన్నత శిఖరానికి వెళ్లాలని సూచించారు. యువతకి ఆదర్శంగా నిలుస్తున్న సొసైటీ సభ్యులను అభినందించారు. దాతలు ఎవరైనా సహాయం చేయాలనే ఆలోచన ఉంటే మా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు సమాచారం ఇస్తే వారి దయార్థ హృదయానికి న్యాయం చేస్తుందని సొసైటీ వ్యవస్థాప అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ తెలిపారు. గొప్ప కార్యక్రమానికి సహకరించిన సందెల మహిర కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభు దేవ్, పట్టణ అధ్యక్షుడు నంది పాటరాజు, మండల అధ్యక్షుడు సకినాల శంకర్, దాడి రాజు, ఎండీ జావిద్ పాషా, రవీందర్, నాగరాజు, చరణ్ పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో స్కై జిమ్‌కు పతకాలు



నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల జిల్లా నస్పూర్ సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల్లో బెల్లంపల్లి స్కై జిమ్ క్రీడాకారులు 8 పతకాలు సాధించారని జిమ్ కోచ్ సదానందం తెలిపారు. నస్పూరి ఎలిఫెంట్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషుల విభాగంలో విభాగంలో బెల్లంపల్లి స్కై జిమ్ క్రీడాకారులు పలు పథకాలు సాధించినట్లు తెలిపారు. 80 కిలోల విభాగంలో జి. లక్ష్మణ్ బంగారు పథకం సాధించారన్నారు. మాస్టర్ విభాగంలో పులి శెట్టి కృష్ణస్వామి బంగారు పథకం, 50 కిలోల విభాగంలోర వెండి పథకం, అక్షయ్ 70 కిలోల విభాగంలో బంగారు పథకం సాధించి జూనియర్స్ విభాగంలో రెండవ స్థానం కైవసం చేసుకున్నారన్నారు. రేవంత్ 55 కిలోల విభాగంలో, జూనియర్స్ విభాగాల్లోనూ బంగారు పథకం సాధించినట్లు వివరించారు. జీ.రవి 55 కిలోల విభాగంలో నాలుగో స్థానంలో గెలిచారన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

రైతాంగ సమస్యలపై దండేపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా మండల బీజేపీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు హేమంత్ రెడ్డి మాట్లాడుతూ 6 గ్యారంటీలతో అబద్ధపు పునాదుల పైన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కి తెలంగాణలో కాలం చెల్లిందన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్న విషయం కాంగ్రెస్ గుర్తెరగాలన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని వర్షాకాలం పంట కొనుగోలు చేసి మూడు నెలలు గడిచి యాసంగి పంట కోతకు వస్తున్న ఇంకా రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయలేదన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయ రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన సందర్భాలు చరిత్రలో లేవన్నారు. ఇందుకు గత బీఆర్ఎస్ పార్టే ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో ఈ నెలాఖరున కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిలో నాయకులు వెంకటరమణ, గురువయ్య, గంగన్న ఉన్నారు.



లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఎస్పీ

నవతెలంగాణ-జైనథ్



జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాన్ని బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అఖిల్ మహాజన్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. లక్ష్మీ నారాయణ స్వామి ప్రతిమను అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి అశోక్ రెడ్డి, జైనాథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు బుధవారం రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు సత్యరాజ్ ఉపారపు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో విజయాలను చేరే వరకు నిర్విరామంగా కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండ శ్రమిస్తే కష్టానికి తగ్గ ఫలితం వస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నొమన్ అర్షద్ హెల్ప్ వీల్ ఫౌండేషన్ వ్యవస్థపకులు అతీష్ కుమార్, ఆరిఫ్ పారిక్, ఉపాధ్యాయులు సయ్యద్ అర్షియా ఉన్నారు.



ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం మండలంలోని బంగారిగూడ మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలు, మెనూ ప్రకారం ఈ రోజు చేస్తున్న వంట, స్టోరేజ్‌లను పరిశీలించారు. మరో వారం రోజుల్లో జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు. ప్రతీ తరగతి గదిని పరిశీలించి, పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని, ప్రతీ రోజూ దినచర్యలో భాగంగా ఉదయం, సాయంత్రం రివ్యూ చేసుకోవాలనీ, ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. వెనుకబడి ఉన్న ఉన్న సబ్జెక్టులపై దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపల్ రాజశేఖర్, డీఎంహెచ్‌ఓ నరేంద్ర రాథోడ్, ఉపాధ్యాయులు, ఆర్‌బీఎస్‌కే టీమ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నవతెలంగాణ-బోథ్

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ, శాస్త్రీయ బద్దంగా అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కూడాల స్వామి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించి, ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కారం రవి, మండల కన్వీనర్ అయిండ్ల మహేష్, నాయకులు బిక్క రమణయ్య, అశోక్, వాగ్మారే సదాశివ్, అడ్డు ఆశన్న, వికలాంగుల నాయకులు, మహిబూబ్ పాల్గొన్నారు.

అభ్యాసనా సామాగ్రి అందజేత



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కోర్వ నవీన్‌రెడ్డి న్యాయవాది నెలకొల్పిన కొర్వ నవీన్ రామకృష్ణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, ఇంగ్లీష్ డిక్షనరీలు అభ్యాసనా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం కీలకమని, సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలు ప్రగతి బాట పడతాయని అన్నారు. కోర్వ నవీన్‌రెడ్డి న్యాయవాది కెఎన్‌ఆర్ ట్రస్టు అందించిన సహకారంతో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి పది పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకొని తల్లి దండ్రులకు పాఠశాలకు మండలానికి మంచిపేరు తేవాలని సూచించారు. ముందుగా పరీక్షలు రాయబోయే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, మహేష్, లింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధ విహార్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 16న రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇచ్చోడలో నూతనంగా ఏర్పాటు చేసిన మహా ప్రజ్ఞ బుద్ధ విహార్ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షురాలు దాయాశీల హూక్కే తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దీనికి అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపిస్తారని తెలియజేశారు. దీనికి బౌద్ధ ఉపాసకులు, బౌద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పుష్పలత జాడే, రత్నజాడే ప్రజ్ఞ కుమార్, నీలుబాయి, శాంత, వైజయంతి, విఠల్ బొక్తే, దయనంద్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి గాయాలు

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో బుధవారం ఉదయం పదకొండు గంటలకు రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంక్ ప్రధాన రహదారిపై రెండు బైక్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ధర్మాజీపేట్‌కు చెందిన మగ్గిని ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా, వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-బేల

మండలంలోని కాప్సీ గ్రామంలో రూ.2లక్షలు ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులనకు గ్రామస్తులు బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డోప్టాల చైర్మెన్ జితేందర్, నాయకులు జక్కుల మధుకర్, భేదొడ్కర్ అవినాష్, దిలీప్, ఉద్దవ్, బీజేపీ నాయకులు వైద్య ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ద్వారా కడెం ప్రాజెక్టును నింపాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి ఎం.అడివయ్య



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎస్సారెస్పీ ద్వారా కడెం ప్రాజెక్టును నింపి ఒక ఎకరం ఎండిపోకుండా ఏప్రిల్ చివరి వరకు నీళ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ సమావేశం బుధవారం టిఎన్జీఓ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలు ఒక ఎకరం కూడా ఎండిపోకుండా నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ ద్వారా సాగవుతున్న వరి పొలాలకు, పంటలకు సరస్వతి కెనాల్, సదర్మాట్, కడెం ప్రాజెక్టు కింద వరి పొలాలు సాగు అవుతున్నాయని అన్నారు. కడెం ప్రాజెక్టును ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి సరస్వతి కెనాల్, సదర్మాట్ ద్వారా నింపి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని మొత్తం ఎనిమిది తడులు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8వ తడి నీళ్లు ఇవ్వకపోతే 25 శాతం పొలాలు దెబ్బతింటాయని జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి పెట్టి పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, నాగెల్లి నర్సయ్య, అడ్వకేట్ ఫసివుద్దిన్, ప్రసన్న, లత పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు చేస్తే ఫారెస్ అధికారులపై తిరుగుబాటు తప్పదు

- తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదివాసులపై అక్రమ అరెస్టులు చేస్తే ఫారెస్ అధికారులపై తిరుగుబాటు తప్పదని తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. బుధవారం కుమురంభీం కాలనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్యాయంగా అరెస్టు చేసిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలన్నారు. లేదంటే ఆసిఫాబాద్ ఫారెస్ట్ జిల్లా కార్యాలయం ముట్టడి చేస్తామన్నారు. అటవీ అధికారులు ఆదివాసీ చట్టాలను, హక్కులను కాలరాస్తు, ఆదివాసులకు వ్యతిరేకంగా పోవడం సబబు కాదన్నారు. నిజ నిర్ధారణ చేయకుండా, అమాయక కొలాం ఆదివాసీ ప్రజలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. టైగర్ జోన్ పేరిట ఆదివాసీ గ్రామాలను తరలించే కుట్రలు ఇకనైనా అపాలని, లేకుంటే ఆదివాసుల ప్రతాపం ఫారెస్ట్ అధికారులు చూస్తారని అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని రింగారిట్ గ్రామంలో గత వారం రోజుల కిందట అదే గ్రామానికి చెందిన గ్రామ పటేల్ కోవ జంగు, కోవ రాములను చెట్లు నరికారనే నేపంతో అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అమాయక ఆదివాసులను అటవీశాఖ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బేషరత్తుగా విడుదల చేయాలని వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఊయిక ఇందిర, ఆదిలాబాద్ డివిజన్ కమిటీ అధ్యక్షురాలు సొయం లలిత, పుస్నక్ నాగరావ్, గెడం గణేష్, గేడం అనందరావు, వెట్టి పార్వతిబాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు కండ్లద్దాలు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కండ్లజోడు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులకు కండ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రతీ స్కూల్స్, హస్టల్ విద్యార్థులకు గతవారం నుంచి నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలలో భాగంగా జిల్లాలో 1780 మందిని గుర్తించడం జరిగిందనీ, బంగారిగూడ మోడల్ పాఠశాలలో 18 మందికి దృష్టి లోపం ఉందని గుర్తించి, కండ్లద్దాలు అందజేయడం జరిగిందనీ అన్నారు. కంటి సమస్యలు రాకుండా ప్రతీ ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలని, ఆర్‌బీఎస్‌కే ద్వారా కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రతీ పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్, ఆర్‌ఎస్‌బీఎస్‌కే శ్రీనివాస్, డాక్టర్ సర్పరాజ్, నరేందర్, ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు



నవతెలంగాణ-బోథ్

అరెస్ట్‌తో ఉద్యమాన్ని ఆపలేరని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసంతృప్తి చెంది, అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన సమయంలో బోథ్, సొనాల మండలాల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బోథ్ పోలీసులు నాయకులను ముందస్తూ అరెస్టు చేయడం సరి కాదన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగే వారిపైన ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని, భవిష్యత్తులో ప్రజలు ఈ ప్రభుత్వాన్ని తగిన బుద్ధి చెప్తారని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ కన్వీనర్ దామెర నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సోలంకి రుక్మాన్ సింగ్, మాజీ సర్పంచ్ గొర్ల సురేందర్ యాదవ్, సొనాల బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మునేశ్వర్ సోమన్న పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మండలంలోని బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని, రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని అన్నారు. అడగడానికి వెళ్లిన నాయకులను అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఇందులో స్థానిక మాజీ సర్పంచ్ సాయన్న, చందు నాయక్ తాండ మాజీ సర్పంచ్ కవీందర్ ఉన్నారు.

మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి ఖబడ్దార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్ రెడ్డి ఖబడ్దార్ అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 తదితర పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తూ, ఉప కులాల విద్యార్థి నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసపూరిత వైఖరిని ఖండిస్తున్నామన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకొని రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తక్షణమే పరీక్షల ఫలితాలను వాయిదా వేయాలని నినాదాలు చేశారు. ఇకనైన ముఖ్యమంత్రి మేలుకొని సుప్రీంకోర్టు సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగంలో మాదిగలకు వర్గీకరణ కోరుకునే దళితులకు న్యాయం చేసే విధంగా ముందుకు రాకపోతే కాంగ్రెస్ పార్టీ మీద మాదిగల యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, సందూరి వినయ్, సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు బరుకుంట సుభాష్, టౌన్ ప్రెసిడెంట్, మడిపల్లి మనోజ్, రూరల్ మండలాధ్యక్షులు తరుడి శంకర్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్, పెద్దింటి సూర్య ప్రసాద్, భిక్కీ దేవిదాస్, తరుడి అంజన్న, బత్తిని గంగయ్య పాల్గొన్నారు.



అదనపు బస్ కోసం ప్రయాణికుల ఆందోళన

- బస్టాండ్ వద్ద ఉద్రిక్తత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ వెళ్లే రూట్‌కు సాయంత్రం ఏడు గంటలకు ఉండే ఎక్స్‌ప్రెస్‌తో పాటు అదనపు బస్సు వేయాలంటూ ప్రయాణికులు బస్సు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెరమెరి, ఝరి, ధనోర, కొఠారి, వాడిగూడ నుండి ప్రతిరోజు కూలీ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తున్నామని సాయంత్రం పూట వెళ్లే క్రమంలో బస్సులు లేక ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా ఆర్టీసీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని దీనితో విసుగుచెంది ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమకు ప్రతిరోజు కెరమెరి వరకు సాయంత్రం పూట ప్రత్యేక బస్సు నడపాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు బస్సును కదలనిచ్చే ప్రసక్తి లేదని హెచ్చరిస్తూ బస్టాండ్ లోపలికి వచ్చే బస్సులతో పాటు ప్రధాన రహదారిపై వాహనాలను ఆపివేశారు. ఇదే విషయంపై కంట్రోలర్ పోచంను వివరణ కోరగా కెరమెరికి ప్రత్యేక బస్సు వేస్తానని, ఆదిలాబాద్ బస్సును వెళ్లేలా చూడాలని దూర ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు ఉన్నారని కోరారు. ప్రయాణికులు అంగీకరించకపోవడంతో చివరకు ఆదిలాబాద్, కెరమెరి రెండు బస్సులను ఒకేసారి పంపించారు. ఏది ఏమైనా గత కొద్ది రోజులుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తీర్చడంలో ఆర్టీసీ అధికారులు విఫలమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా స్పందించి ప్రతిరోజు సాయంత్రం పూట ప్రత్యేక బస్సు కెరమెరి వరకు గిరిజన కూలీల కోసం నడుపుతారో లేదో వేచి చూద్దాం.

ప్రధానోపాధ్యాయున్ని, వార్డెన్ సస్పెండ్ చేయాలి

- డీఎస్‌ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతావత్ రవీందర్



నవతెలంగాణ-ఉట్నూర్

ఇచ్చోడలోని ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని లాలిత్య అనుమానస్పదంగా మృతి చెందిందని నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయున్ని, వార్డెన్ సస్పెండ్ చేయాలని డీఎస్‌ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతావత్ రవీందం అన్నారు. బుధవారం మండలంలోని ఎస్‌ఆర్ నగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థికి జ్వరం ఉండటంతో వార్డెన్, ప్రధానోపాధ్యాయులకు చెప్పినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని అన్నారు. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. దీంతో పాటు మృతి చెందిన విద్యార్థి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డీఎస్‌ఓ జిల్లా, మండల నాయకులు ఇంద్రాల శ్రీహరి, అందారే రాజేశం, జాదవ్ అరుణ్ కుమార్, టేకుల తిరుపతి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- అధ్యాయన్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని మున్యాల అధ్యాయన్ ప్రయివేటు పాఠశాల మొదటి వార్షికోత్సవ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ పెరిక గంగాధర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు విశిష్ట వేసాధారణలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. దీంతో పోషకులను విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం గ్రామంలో ఉన్న నాయకులను, ట్రాస్మా సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ఖానాపూర్ మండలాధ్యక్షులు ఉప్పల మల్లేష్, బండపాటి మనోహర స్వామి, నాగ మొగిలి, శ్రీనివాస్, దొనకొండ స్వామి, కట్కూరి రాజేష్, ప్రసాద్, నరేష్ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత ట్రైనింగ్ ఉద్యోగ కల్పనకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత ట్రైనింగ్ ఉద్యోగం కల్పించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ట్రైనింగ్ అనంతరం ప్రయివేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు మార్చి 15 నుంచి ఏప్రిల్ 8 వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.గావ్.ఇన్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి బీసీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా (30) మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని మరింత సమాచారం కొరకు ఫోన్ 08732-221280ని సంప్రదించాలని సూచించారు.

ఆత్మీయ సన్మాన కార్యక్రమం



నవతెలంగాణ-వాంకిడి

మండల విద్యాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రాథోడ్ మానుకుమార్, మండల నోడల్ అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన రాథోడ్ సుభాష్, ఉద్యోగోన్నతిపై వెళ్లిన వెంకటరాజయ్యలను మండల ఉపాధ్యాయులు మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శివచరన్ కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నటరాజ్, ప్రబోధ్ కుమార్, వెంకట రాజయ్య, ఉపాధ్యాయులు ధర్మ బాయి, రాధ, మౌనిక, రవలి, చైతన్య, శివ, సాయి కుమార్, మహేందర్, విద్యా వనరుల కేంద్ర సిబ్బంది తిరుమల పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్ఐకు సన్మానం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఆర్ఐ సురేష్ కుమార్‌ను తహసీల్దార్ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-బేల

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్‌లు చదువుతున్న విద్యార్థులు మార్చి 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని కీర్తన డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా వరప్రసాద్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వైస్ ప్రిన్సిపాల్ పుష్ప, పరీక్షల ఇన్‌చార్జి సాగర్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కేసీఆర్‌తో కలిసి బడ్జెట్ సమావేశాలకు అనిల్ జాధవ్

నవతెలంగాణ-నేరడిగొండ

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం మొదలయ్యాయి. బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



భూ సమస్యలపై ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులలో పెండింగ్ ఉన్నవాటిని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వరరావు, అన్ని మండలాల తహశీల్దార్‌లతో భూభారతిలో వచ్చిన సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులను సరిచూసి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తు ఫైల్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, రాజస్వ మండల అధికారి లాగిన్‌లలో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పై ప్రతిరోజు సమీక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఉపాధి హామీ పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, కారోబార్‌లకు ఎంపీడీఓ అల్బర్ట్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో కనీసం వందమంది కూలీలతో పనులు చేపించాలన్నారు. మండలంలో ఉన్న 12 గ్రామ పంచాయతీలో ఉన్న నర్సరీలల్లో ప్రజలకు అవసరమయ్యే మొక్కలను గ్రీన్ యాక్షన్ ప్లాన్ ప్రకారం పెంచాలని, మండల మొత్తం గ్రామ పంచాయితీలలో నర్సరీలను పంచాయితీ కార్యదర్శులు ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. మార్చి-31లోగా పూర్తి ఇంటి పన్ను 100శాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఎల్కపల్లి గ్రామ పంచాయితీలోని నర్సరిని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సతీష్, క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను 100 శాతం రికవరీ చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్


నవతెలంగాణ-ఆసిఫాబాద్



మహిళా సంఘాల అభివృద్ధిలో భాగంగా అందించే స్త్రీ నిధి రుణాలను 100 శాతం రికవరీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం డీఆర్‌డీఓ దత్తారావుతో కలిసి ఏపీఎం, సీసీలు, మెప్మా సిబ్బందితో స్త్రీ నిధి రుణాల రికవరీ, నూతన రుణాలు జారీ, ప్రమాద బీమా, బ్యాంకు లింకేజీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరుకల్లా స్త్రీ నిధి రుణాల రికవరీ, ఓవర్ డ్యూస్ రికవరీ 100 శాతం పూర్తియాలని, ఈ దిశగా మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సంఘాలలోని సభ్యులు ప్రతి ఒక్కరు ప్రమాద బీమాకు ప్రీమియం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు 100 శాతం బ్యాంకు లింకేజీలు పూర్తి చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతిరామ్, స్త్రీ నిధి సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భూమన్న





నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారిచేసింది. చైర్మన్‌గా మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడిగేల భూమన్న, వైస్ చైర్మెన్‌గా ఖానాపూర్‌కు చెందిన అబ్దుల్ మజీద్‌ను నియమించారు. వీరితో పాటు మరో 16 మందిని మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా నాగవత్ పుల్యానాయక్, సోమరెడ్డి నారాయణరెడ్డి, దాతుర్క గంగాధర్, సాగి అశోక్‌రావు, దండుగుల యాదగిరి, తోకల మహేందర్, ఊరే జలజ, అద్వాలా చిన్న రాజన్న, లక్కవత్తుల నారాయణ, తొడసం విట్టల్, గంప దయాకర్, కట్కం శేఖరయ్యతో పాటు మండల ప్యాక్ చైర్మెన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి సభ్యులుగా ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి కట్కం మధుకర్ అన్నారు. మండలంలోని చెడువాయి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మొబైల్ సైన్స్ ల్యాబ్ సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తి పెరిగి, ఆవిష్కరణలు చేసే సామర్థ్యం పెరుగుతుందని, విద్యార్థులు పుస్తకాలలో చదివిన శాస్త్రీయ అంశాలను ప్రత్యక్షంగా చూసి, అనుభవించి, మరింత అవగాహన పెంచుకుంటారన్నారు. అయస్కాంతంతో ఆటలు, న్యూటన్ నియమాలు, ఉపగ్రహాల పనివిధానం, దృష్టి మోసాలు, విద్యుత్ ప్రవాహం, జీవ కణాలు, గణిత పునాదులు మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, సైన్స్ ఉపాధ్యాయులు టి. రాకేష్, సీహెచ్ సుమిత, ఉపాధ్యాయులు యం.రాజకమలాకర్‌రెడ్డి, డి.శిల్ప, స్వప్న పాల్గొన్నారు.

భాస్కర్‌ని సన్మానించిన ఐఎన్టీయూసీ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

గ్రూప్-2 ఫలితాల్లో 229వ ర్యాంక్ సాధించిన కామ్రేడ్ భాస్కర్‌ను ఐఎన్టీయూసీ నాయకులు సన్మానించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి వర్క్ షాప్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కామ్రేడ్ భాస్కర్ గ్రూప్-2 ఫలితాలలో 381 మార్కులు తెచ్చుకొని 229 ర్యాంకు సాధించడం హర్షణీయమన్నారు. ఎస్సీ విభాగంలో స్టేట్ 6 ర్యాంకు సాధించి కాళేశ్వరం జోన్‌లో డిప్యూటీ తహసీల్దార్‌ఉద్యోగం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, తాండూరు మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ దుర్గం రామకృష్ణ, జాతీయ సంఘాల నాయకులు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యాయునికి "స్వామి వివేకానంద సాహిత్య అవార్డు"

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు ఎంపీపీఎస్ మేదరిగూడలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న నూతి అఖిలాష్ సాహిత్య రంగంలో విశిష్టమైన ప్రతిభ కనబరిచినందుకు "స్వామి వివేకానంద సాహిత్య అవార్డు"కు ఎంపిక చేసినట్లుగా జోలి పబ్లికేషన్ సంస్థ నిర్వాహకులు మయాంక్ తెలియచేశారు. అఖిలాష్ రచనలోని భావ వైభవం, విశ్లేషణాత్మకత, మృదుయన్ని తాకే శైలి వారికి ఈ గుర్తింపు తీసుకొచ్చిందని "కలంతో సమాజ మార్పుకు వేదికవ్వాలి" అనే అఖిలాష్ లక్ష్యాన్ని ఈ పురస్కారం మరింత బలపరిచిందన్నారు. "సాహిత్య ప్రపంచానికి వారు అందించిన రచన గొప్పదని, భవిష్యత్తులో ఇంకా అపూర్వమైన రచనలు అందించాలని" ఆకాంక్షించారు.

నేడు దర్గా భూములకు వేలంపాట

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలో ఉన్న హజ్రత్ సయ్యద్ తాలిబ్ అలీ షా బాబా దర్గాకు చెందిన భూములు 10 ఎకరాల చేను, మండలంలోని డోర్పల్లి గ్రామాల్లో ఉన్న 2 ఎకరాల పొలంకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ సాలె బిన్ సయిద్ ఒక ప్రకటనలో తెలిపారు. భూములకు వేలంపాట రెండు సంవత్సరాల కాల పరిమితిని, ఈ వేలంలో పాల్గొనే రైతులు రూ.20వేలు కమిటీ వద్ద జమచేసి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు 9550572163, 7981144110ను సంప్రదించాలన్నారు.